శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి చందనోత్సవం శుభాకాంక్షలు - Advt Feature

ధరిత్రిని కాపాడుకుందాం



బిర్లా జంక్షన్‌లో ర్యాలీ ప్రారంభిస్తున్న వాకర్స్ క్లబ్‌ల ప్రతినిధులు

మురళీనగర్: పుడమితల్లిని కాపాడుకోకుంటే మానవ జాతి మనుగడకు ముప్పు తప్పదని వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్-101 గవర్నర్ ఉప్పలపాటి శుభ అన్నారు. ప్రపంచ ధరిత్రి దినోత్సవం సందర్భంగా శనివారం బిర్లా జంక్షన్ అంబేడ్కర్ విగ్రహం నుంచి పంజాబ్ హోటల్ జంక్షన్ వరకు ధరిత్రిని కాపాడుకోవాలంటూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆధునికత పేరుతో వృక్షాలను తొలగించడమే కాకుండా వాడి పారేసే ప్లాస్టిక్ వంటి అనేక వ్యర్థాలతో మానవాళి భూమిని నింపేస్తోందన్నారు. ప్లాస్టిక్‌ను నివారిద్దాం.. ధరిత్రిని కాపాడుకుందామని ప్లకార్డు ప్రదర్శించి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మట్టి కుండల్లో వేసిన మొక్కలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ ఏరియా కో-ఆర్డినేటర్ పిల్లా అర్జునుడు, త్రీ స్టార్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు ఆర్.ఆర్.ఎస్.మహేష్, త్రీ స్టార్ వనితా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు రమణమ్మ, వాకర్స్ హెల్త్ క్లబ్ అధ్యక్షుడు సిహెచ్.శ్రీనివాసరాజు, ప్రభావతి, రోజారాణి, ఫీలా రాణి, మాధవి, నాగేశ్వరరావు, ప్రమీల, జ్యోతి, జయ పాల్గొన్నారు.

800వ రోజుకు ఉక్కు రిలే దీక్షలు



దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు, కార్మికులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమం మొదలై 800 రోజులు గడుస్తున్నా కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేట్‌పరం చేస్తే చరిత్ర హీనులుగా మిగిలిపోతారని హెచ్చరించారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు శనివారం నాటికి 800వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో ఉక్కు కార్మికులకు మద్దతుగా ఐఎన్‌టీయూసీ నాయకులు పాల్గొని, స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రాజ్యాంగాన్ని తుంగలో తొక్కుతున్న మోదీ ప్రభుత్వానికి ప్రజలు, కార్మికులు కలిసి, అదే రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కుతో గట్టి బుద్ధి చెప్తారన్నారు. ఎందరో కార్మికుల బలిదానాలతో సాధించుకున్న విశాఖ ఉక్కును ప్రైవేట్ వ్యక్తులకు అప్పజెప్పడం దుర్మార్గమన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వరంగంలోనే కొనసాగుతుందని కేంద్రప్రభుత్వం వెంటనే ప్రకటన విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

రూ.9.05 లక్షల చోరీకి పాల్పడిన వ్యక్తి అరెస్ట్

సీతమ్మధార: పోర్ట్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధి శంకరమఠం రోడ్డులో గల రామకృష్ణానగర్‌లోని రియల్ ఎస్టేట్ సంస్థ కార్యాలయంలో రూ.9.05 లక్షల నగదు చోరీకి పాల్పడిన సూర్యనారాయణను క్రైం పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలిలా.. బంగారు రవి, నాయుడు కలిసి రామకృష్ణానగర్‌లో ఎస్ఎస్ రియల్ ఎస్టేట్ సంస్థ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ నెల 17వ తేదీ రాత్రి కార్యాలయ డెస్క్‌లో వారు భద్రపరచిన రూ.9.05 లక్షలు మాయమైంది. రవి, నాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోర్ట్‌టౌన్ క్రైం పోలీసులు కార్యాలయానికి వచ్చి పరిశీలించారు. సంస్థలో పనిచేస్తున్న సూర్యనారాయణ అనే వ్యక్తి నగదు దొంగతనానికి పాల్పడినట్టు గుర్తించి పోలీసులు అతడిని అరెస్ట్ చేశారు.

క్లుప్తంగా

ఉరి వేసుకుని ఒకరు ఆత్మహత్య

తగరపువలస: జీవీఎంసీ రెండో వార్డు సంగివలసకు చెందిన శీరం గోపి (37) గురువారం రాత్రి ఇంట్లో చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇతని తల్లి లక్ష్మి భీమిలి పోలీసులకు చేసిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ గంటా హరీష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. పెయింటింగ్ పనులకు వెళ్లే గోపికి భార్యతో మనస్పర్థలు కారణంగా విడాకులు తీసుకున్నాడు. అలాగే తండ్రి అప్పలరాజు అనారోగ్యంతో బాధపడుతుండడంతో గోపి తీవ్ర మనస్థాపానికి గురయ్యేవాడు. ఈ నేపథ్యంలో మద్యానికి బానిసై గురువారం సాయంత్రం విధుల నుంచి ఇంటికి వచ్చి ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

పవర్ లిఫ్టింగ్‌లో సత్తాచాటిన జ్యోత్స్న, హర్షిత

విశాఖ స్పోర్ట్స్ : ఏపీ అంతరజిల్లాల మెన్, వుమెన్ పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో జ్యోత్స్న, హర్షిత మొత్తంగా 300+కేజీల బరువును ఎత్తి సత్తా చాటారు. రెండు రోజుల పాటు సబ్ జూనియర్స్, జూనియర్స్‌తో పాటు మాస్టర్స్‌కు ఈ పోటీలు స్క్వాట్, బెంచ్‌ప్రెస్‌తో పాటు డెడ్ లిఫ్ట్ అంశాల్లోనూ జరగనున్నాయి. ఏయూ ఇండోర్ జిమ్నాజియంలో తొలిరోజు సబ్ జూనియర్ బాలికల 43 కేజీల వెయిట్ కాటగిరీలో ఎం. షనూన్ స్క్వాట్‌లో 75 కేజీలు, బెంచ్‌ప్రెస్‌లో 27.5కేజీలు, డెడ్‌లిఫ్ట్‌లో 90 కేజీలతో మొత్తంగా 192.5కేజీల బరువునెత్తి తొలి స్థానంలో నిలిచింది. బి.దీక్షిత, సీహెచ్ దొలశ్రీ వరుసగా ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. 52 కేజీల బరువులో ఎ.జ్యోత్స్న స్క్వాట్‌లో 140 కేజీలు, బెంచ్‌ప్రెస్‌లో 70 కేజీలు, డెడ్‌లిఫ్ట్‌లో 135 కేజీలతో మొత్తంగా 345 కేజీల బరువునెత్తి తొలి స్థానంలో నిలిచింది. ఎ.ప్రవల్లిక, కే.ఆశ్రిత వరుసగా ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. 57 కేజీల వెయిట్‌లో ఎస్.కృష్ణవేణి స్క్వాట్‌లో 80 కేజీలు, బెంచ్‌ప్రెస్‌లో 42.5 కేజీలు, డెడ్‌లిఫ్ట్‌లో 100 కేజీలతో మొత్తంగా 222.5 కేజీల బరువునెత్తి తొలిస్థానంలో నిలిచింది. ఆర్.వందన, ఎం.జనని వరుసగా ద్వితీయ, తృతీయస్థానాల్లో నిలిచారు. 63 కేజీల వెయిట్‌లో హర్షిత తివారి స్క్వాట్‌లో 125 కేజీలు, బెంచ్‌ప్రెస్‌లో 60 కేజీలు, డెడ్‌లిఫ్ట్‌లో 140 కేజీలతో మొత్తంగా 325 కేజీల బరువునెత్తి తొలిస్థానంలో నిలిచింది. ఎస్.లక్ష్మి, ఎం.పూరిమ వరుసగా ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. 69 కేజీల వెయిట్‌లో జి.సుభాషిణి స్క్వాట్‌లో 120 కేజీలు, బెంచ్‌ప్రెస్‌లో 45 కేజీలు, డెడ్‌లిఫ్ట్‌లో 125 కేజీలతో మొత్తంగా 290 కేజీల బరువునెత్తి తొలి స్థానంలో నిలిచింది. ఎస్.షైనీ, పి.భానుశ్రీ వరుసగా ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు.

సాయిబాబా ఆలయంలో రంజాన్ వేడుకలు



చినగదిలి నార్త్ షిర్డీ సాయిబాబా ఆలయంలో పూజలు చేస్తున్న ముస్లింలు

ఆరిలోవ: చినగదిలి నార్త్ షిర్డీ సాయిబాబా ఆలయంలో శనివారం రంజాన్ వేడుకలు జరిగాయి. ఆరిలోవ ప్రాంతానికి చెందిన ముస్లిం కుటుంబాలు ఇక్కడ సాయిబాబాను దర్శించుకొన్నారు. ఆలయ ఆస్థాన అర్చకుడు నగేష్ శర్మ ముస్లిం సోదరులతో సాయినాథుడుకి ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం ఆలయంలో కురాన్ పఠనం చేశారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులు మధ్యాహ్నం పేదలకు అన్న సమారాధన నిర్వహించారని ఆలయ చైర్మన్ వానపల్లి అప్పారావు తెలిపారు.

‘ చంద్రబాబుకు దళితులంటే చులకన ’

అక్కిరెడ్డిపాలెం: చంద్రబాబు దళితులపై చులకన భావంతో వ్యవహరిస్తున్నారని విశాఖ జిల్లా ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ మెంబర్ బోనెల జోసెఫ్ అన్నారు. ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెంలో చంద్రబాబు వ్యవహరించిన తీరును ఒక ప్రకటనలో విమర్శించారు. మంత్రి ఆదిమూలపు సురేష్‌పై చంద్రబాబు తన కార్యకర్తలను రెచ్చగొట్టి దాడులకు పాల్పడేటట్టు చేయడం సిగ్గుచేటని మండిపడ్డారు. చంద్రబాబు పాలనలో స్వయంగా ఒక మంత్రి విశాఖ జిల్లా పెందుర్తి మండలం, జెర్రిపోతుల పాలెంలో ఒక దళిత మహిళను వివస్త్రను చేసి దాడి చేసిన విషయం అందరికీ తెలిసిందే అని పేర్కొన్నారు. ‘ఎవరైనా దళితులుగా పుట్టాలనుకుంటారా’ అని విలేకరుల సమావేశంలో చంద్రబాబు స్వయంగా దళితులను అపహాస్యం చేశారని గుర్తు చేశారు.

మంత్రి రాజశేఖర్‌కు అభినందన



మంత్రి రాజశేఖర్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందిస్తున్న భోగవల్లి నాగభూషణం

మల్కాపురం: ఎంఈఎస్ స్టాఫ్ అండ్ వర్కమెన్ యూనియన్ అధ్యక్షుడిగా ఇంటక్ నగర అధ్యక్షుడు మంత్రి రాజశేఖర్ ఏకగ్రీవంగా ఎన్నిక కావడంతో ఆయనకు అభినందనలు వెల్లువెత్తాయి. యూనియన్ కార్యాలయంలో శనివారం మంత్రి రాజశేఖర్‌ను ఇంటక్ జిల్లా ప్రధాన కార్యదర్శి భోగవల్లి నాగభూషణం,ఎంఈఎస్ స్టాఫ్ అండ్ వర్క్ మెన్ యూనియన్ నాయకులు కలిసి అభినందించారు.



సింహగిరిపై ఏర్పాట్లు పరిశీలిస్తున్న దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ



సహస్ర ఘటాభిషేకానికి సిద్ధం చేసిన కలశాలు



సుందరంగా ముస్తాబు చేసిన సింహగిరిపై రాజగోపురం

సింహగిరికి చందనోత్సవ శోభ

- భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు



రూ.300 దర్శనం క్యూలు

సింహాచలం: సింహగిరికి చందనోత్సవ శోభ వచ్చింది. ఆలయ పరిసరాలతో పాటు అడవివరం నుంచి గోశాల వరకు ఆధ్యాత్మిక వాతావరణం వచ్చింది. చందనోత్సవాన్ని పురస్కరించుకుని సింహగిరిపై పలు శాఖల సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. గతంలో జరిగిన పొరపాట్లకు తావు లేకుండా యంత్రాంగం జాగ్రత్తలు తీసుకుంది. ఉచిత దర్శనంతో పాటు రూ.300,రూ.1000, రూ.1500 దర్శన క్యూలు ఏర్పాటు చేశారు. క్యూలో ఉండే వారికి ఎండ తగలకుండా షామియానాలు, టెంట్లు వేశారు. భక్తులకు క్యూల్లో మంచినీరు అందించే ఏర్పాట్లు చేశారు. రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి మంత్రికొట్టు సత్యనారాయణ సింహగిరిపై ఏర్పాట్లు పరిశీలించారు. గోశాల, అడవివరం జంక్షన్‌లో ఏర్పాటు చేసిన తాత్కాలిక మరుగుదొడ్ల వద్ద నిరంతరం నీటి సరఫరా ఉండాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ జోన్-8 అధికారులను ఆదేశించారు. కొండదిగువ బస్టాండ్ ఏరియా, పాతఅడవివరం జంక్షన్, పాత గోశాల జంక్షన్‌లో ద్విచక్రవావానాలు నిలిపేందుకు పార్కింగ్ సదుపాయం కల్పించారు. పాత గోశాల జంక్షన్ నుంచి వేపగుంట మార్గంలో కార్లు నిలిపేందుకు పార్కింగ్ ఏర్పాటు చేశారు.



భక్తుల కోసం ఏర్పాటు చేసిన క్యూ లైన్



తాత్కాలిక మరుగుదొడ్ల ఏర్పాట్లపై సూచనలిస్తున్న కమిషనర్ సాయికాంత్‌వర్మ

నేల తల్లిని స్మరించే గొప్ప సంస్కృతి మనది

ధరిత్రి దినోత్సవంలో చినజీయర్ స్వామి అనుగ్రహభాషణం



హాజరైన విద్యార్థులు

ఏయూక్యాంపస్: పుడమి పరిరక్షణలో ప్రతి వ్యక్తి తన బాధ్యతను గుర్తెరిగి నడచుకోవాలని చినజీయర్ స్వామి అన్నారు. శనివారం సాయంత్రం ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో వికాస తరంగిణి నిర్వహించిన మన భూమి మన బాధ్యత కార్యక్రమంలో ఆయన పాల్గొని విద్యార్థులనుద్దేశించి అనుగ్రహ భాషణం చేశారు. విశ్వంలో సమస్త ప్రాణికోటితో మానవ జీవనం ముడిపడి ఉందనే విషయం విస్మరించరాదని సూచించారు. నిత్యం ఉదయం నిద్రలేస్తూనే నేలతల్లిని నమస్కరించి, స్మరించే గొప్ప సంస్కృతి మన సొంతమన్నారు. మనమంతా నేలతల్లి ఒడిలో ఆటలాడే పిల్లలమన్నారు. ధరిత్రీ పరిరక్షణకై మనలో మనం ఆలోచన చేయాల్సిన అవసరాన్ని వివరించారు. నేలను తల్లిగా భావించడం వేదకాలం నుంచి ఉందన్నారు. విశ్వంలో మన స్థానం ఏంటని ఒకసారి మానవులు ప్రశ్నించుకోవాలన్నారు. గాలి,నీరు, ప్రాణికోటి బాగుంటేనే మనం బాగుంటామనే విషయం మరువకూడదన్నారు.

అహోబిల జీయర్ స్వామి మాట్లాడుతూ యువశక్తి సమాజ హితాన్ని కాంక్షించాలన్నారు. ఆదర్శవంతమైన జీవనం సాగించడం అలవరచుకోవా లని సూచించారు. మంచి భావన వలన మంచి ఫలితం కలుగుతుందన్నారు. ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాద రెడ్డి మాట్లాడుతూ ప్రతి ప్రాణిని సంరక్షిస్తూ ధరిత్రిని కాపాడాలని పిలుపునిచ్చారు. పుడమి కేవలం మనుషులదే అనుకోవడం సరికాదన్నారు. ఏయూ నిర్వహించే కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రాజెక్టుల్లో జీయర్ స్వామి నిర్వహించే కార్యక్రమాలు అనుసంధానం చేయాలని కోరారు.



ప్రసంగిస్తున్న చినజీయర్ స్వామి

సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ వీవీ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రకృతిని విస్మరిస్తే ముప్పు తప్పదనే విషయాన్ని కథారూపంలో విద్యార్థులకు వివరించారు. ధరిత్రిని కాపాడుకోవడం మనందరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో వికాస తరంగిణి సభ్యులు టి.టి.వి రమణ మూర్తి, సాతులూరి రామానుజం, పి.పద్మనాభ రావు, నారాయణ రెడ్డి, అడుసుమిల్లి రాము తదితరులు ప్రసంగించారు. అనంతరం ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులను, ధరిత్రీ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వక్తృత్వ పోటీలలో విజేతలైన విద్యార్థులను సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు.

స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకుంటాం

- ఐఎన్‌టీయూసీ జిల్లా జనరల్ సెక్రటరీ నాగభూషణం
- 750వ రోజుకు‘ఉక్కు’ పరిరక్షణ దీక్షలు



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద దీక్షలో పాల్గొన్న బీహెచ్‌ఈఎల్ నాయకులు

సీతమ్మధార: కేంద్ర ప్రభుత్వం ఆటలు ఇకపై సాగవని,‘విశాఖ స్టీల్‌ప్లాంట్, ఇతర దేశ సంపదలను కాపాడుకుంటామని ఐఎన్‌టీయూసీ జిల్లా జనరల్ సెక్రటరీ బి.నాగభూషణం అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మిక, ప్రజా సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిర్వహిస్తున్న రిలే దీక్షలు శనివారంతో 750వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మే హక్కు మోదీ సర్కారుకు లేదన్నారు. భూములు కోల్పోయిన నిర్వాసితులకు ఉపాధి కల్పించాలని, ప్లాంట్‌కు గనులు కేటాయించాలని కోరారు. కేంద్రం తీసుకున్న ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, కొత్తగా తీసుకొచ్చిన నాలుగు కార్మిక కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పలు యూనియన్ల నాయకులు వారాల ఆనందరావు, వి.బాబురావు, పి.వి.అప్పారావు, పి.ఆనందకుమార్, మురళీశ్వరరావు, నరసింహారావు, జి.దేముడు తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు క్రీడాకారులకు క్రికెట్ కిట్ బహూకరణ



క్రీడాకారులతో ఆస్ట్రేలియా క్రికెట్ కోచ్ వెంకటరావు, అధికారులు

ఉక్కునగరం: సీల్‌ప్లాంట్ క్రికెట్ క్రీడాకారులకు శనివారం క్రికెట్ కిట్‌ను బహూకరించారు. ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్ లెవెల్-2 కోచ్ వెంకటరాజు ఇటీవల ఉక్కు స్టేడియంలో ఏర్పాటు చేసిన ఎర్రమట్టి పిచ్, ఆట మైదానాలను ముఖ్య అతిథిగా ప్రారంభించారు. స్టేడియంలో ప్రాక్టీస్ చేస్తున్న క్రీడాకారుల అవసరాలను గుర్తించిన వెంకటరాజు స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో సీనియర్ క్రికెట్ టీమ్‌కు అవసరమైన రెండు ఇంగ్లీష్ విల్లో బ్యాట్లతో కూడిన పూర్తి కిట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన క్రీడాకారులకు పలు మెలకువలు వివరించారు. నిత్యం ప్రాక్టీస్ చేయడంతోనే మంచి క్రీడాకారులుగా ఎదుగుతారని సూచించారు. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ స్పోర్ట్స్ విభాగం మాజీ జీఎం ఎం.ఎస్. కుమార్, ఇన్‌చార్జ్ సీజీఎం డాక్టర్ కె.హెచ్.ప్రకాశ్, విభాగం ఉద్యోగులు పాల్గొన్నారు.

గోవిందా.. గోవిందా



శ్రీవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

కొమ్మాది: రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం శ్రీవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. వేకువజామున సుప్రభాత, తోమాల సేవ అనంతరం భక్తులకు సర్వదర్శనం కల్పించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వందలాది మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. సాయంత్రం నిర్వహించిన కోలాటాలు, గోవింద నామ కీర్తనలు భక్తులను ఆకట్టుకున్నాయి.

24న ఐపీఆర్‌పై ఆన్‌లైన్ క్విజ్ పోటీలు

ఏయూక్యాంపస్: ప్రపంచ మేధోహక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏయూ ఐపీఆర్ చెయిర్ ఆధ్వర్యంలో ఈ నెల 24న మేధో హక్కులపై ఆన్‌లైన్ క్విజ్ పోటీలను నిర్వహిస్తు న్నట్లు కేంద్రం సంచాలకులు ఆచార్య హను మంతు పురుషోత్తం తెలిపారు. ఉదయం 11.30 నుంచి 12.30 గంటల వరకు ఈ పోటీలను నిర్వహిస్తామన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ముందుగా తమ వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. విజేతలకు మూడు నగదు పురస్కారాలు అందిస్తామని, పాల్గొన్న వారికి ఈ సర్టిఫికెట్లను అందిస్తామన్నారు. పూర్తి వివరాలకు 95992 29217 నంబర్లో సంప్రదించా లని కోరారు.

ఉక్కు అడ్మిన్ బిల్డింగ్ వద్ద పాము కలకలం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ప్రధాన పరిపాలన భవనం వద్ద పాము కలకలం రేపింది. స్నేక్ క్యాచర్ కిరణ్‌కుమార్ వచ్చేవరకు స్థానికులు ఆందోళన చెందారు. పామును పట్టుకున్న అనంతరం ఊపిరి పీల్చుకున్నారు. వివరాలివి.. స్టీల్‌ప్లాంట్ పరిపాలనా భవనం ఎదురుగా ఉన్న ప్రైవేటు షాపు నిర్వాహకులు ఉదయం షాపు తెరిచేందుకు రాగా, అక్కడ పాము తిరుగుతూ కనిపించింది. దాంతో ఆయన కంగారుతో ఎదురుగా ఉన్న పరిపాలన భవనం వద్ద వెళ్లారు. అక్కడున్న వ్యక్తులకు చెప్పడంతో వారు వచ్చి చూసి, వెంటనే స్నేక్ క్యాచర్ కిరణ్‌కుమార్‌కు సమాచారం అందించారు. కిరణ్‌కుమార్ కొంతసేపటికి అక్కడికి చేరుకుని పాము కోసం వెదికారు. ఎట్టకేలకు సుమారు నాలుగు అడుగుల పొడవు కలిగిన నాగజెర్రిని పట్టుకుని, అక్కడి నుంచి తరలించారు.



పట్టుకున్న నాగజెర్రితో పాముల కిరణ్‌కుమార్

భక్తిభావాన్ని పంచిన హనుమాన్ చాలీసా



హనుమాన్ చాలీసా పారాయణ చేస్తున్న విద్యార్థులు

అల్లిపురం: బల్లిగిరి ప్రసన్న వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం సందర్భంగా చిన్నారులతో హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. డాబాగార్డెన్స్‌లోని మీనాబాల స్కూల్ విద్యార్థులు 11 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం చేపట్టారు. దీంతో ఆ ప్రాంతమంతా భక్తి పారవశ్యంతో మార్మోగింది. ఈ సందర్భంగా విద్యార్థుల పేరిట ఆలయ అర్చకుడు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

కనకమహాలక్ష్మిని దర్శించుకున్న హైకోర్టు జడ్జి

అల్లిపురం: బురుజుపేటలో కొలువైన కనకమహాలక్ష్మి అమ్మవారిని శనివారం సాయంత్రం రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ బి.శ్యామ్‌సుందర్ దంపతులు, దేవదాయ శాఖ ట్రిబ్యునల్ చైర్మన్ హరనాథ్ దంపతులు సాయంత్రం దర్శించుకున్నారు. వారికి ఆలయ సంప్రదాయం ప్రకారం ఉప కలక్టర్, కార్యనిర్వహణాధికారి కె.రమేష్‌నాయుడు స్వాగతం పలికారు. అమ్మవారికి విశేష పూజ, వేద ఆశీర్వచనం అనంతరం ప్రసాదం అందజేశారు. ఆలయ ఏఈవో వి.రాంబాబు పాల్గొన్నారు.



అమ్మవారి సన్నిధిలో జస్టిస్ శ్యామ్‌సుందర్, ట్రిబ్యునల్ చైర్మన్ హరనాథ్ దంపతులు

జీవీఆర్ నాయుడు సేవలు అభినందనీయం

అక్కిరెడ్డిపాలెం: విధి నిర్వహణలో జి.వి.ఆర్.నాయుడు చేసిన సేవలు ఎంఎస్ఎంఈ ఉద్యోగులు, పారిశ్రామికవేత్తలు ఎప్పటికీ గుర్తుంచుకుంటారని విశాఖ ఆటోనగర్ స్మాల్ స్కేల్ ఇండస్ట్రియలిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (వాసీవా) అధ్యక్షుడు ఎ.కె.బాలాజీ అన్నారు. ఎంఎస్ఎంఈ ఇన్‌చార్జి ఏడీగా విధులు నిర్వర్తించి, ఉద్యోగ విరమణ చేసిన జి.వి.ఆర్.నాయుడును వాసీవా అధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మానించారు. అనంతరం ఉన్నతోద్యోగులు, అధికారులు మాట్లాడుతూ నాయుడు క్రమశిక్షణను కొనియాడారు. అనంతరం నాయుడు దంపతులను వాసీవా, ఐలా, ఎస్సీ, ఎస్టీ ఎంటర్‌ప్రెన్యూర్స్, ఒడిశా ఎంఎస్ఎంఈ అధికారులు, ఫ్యాప్సీ అధికారులు, పలువురు పారిశ్రామిక వేత్తలు ఘనంగా సన్మానించారు. జ్ఞాపికలు బహూకరించారు. వాసీవా ఉపాధ్యక్షుడు ఇ.కృష్ణ ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఐలా కమిషనర్ కె.సూర్యనారాయణ, చైర్మన్ కె.సత్యనారాయణ రెడ్డి, కార్యదర్శి చీకటి సత్యనారాయణ, ఒడిశా ఎంఎస్ఎంఈ రిటైర్డ్ బ్రాంచ్ మేనేజర్ పంచేంద దాస్, ఫ్యాప్సీ అధ్యక్షుడు వాసిరెడ్డి మురళీకృష్ణ, పెదగంట్యాడ అధ్యక్షుడు సత్యనారాయణ, వాసీవా కార్యదర్శి బి.ఎస్.రావు, ఐలా మాజీ చైర్మన్లు వై.సాంబశివరావు, శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.



జి.వి.ఆర్.నాయుడును సన్మానిస్తున్న ఐలా కమిషనర్, ప్రతినిధులు

రాణి లేని రాజు

జూలో ఒంటరైన జీబ్రా



ఇటీవల మృతి చెందిన ఆడ జీబ్రా(ఫైల్)..

ఆరిలోవ : ఇందిరాగాంధీ జూ పార్కులో జీబ్రా ఒంటరైపోయింది. తోడుగా ఉన్న సహచర జీబ్రా సుమారు నెల కిందట మృతి చెందడంతో ఎన్‌క్లోజర్‌లో ఒంటరిగా తిరోగుతోంది. నాలుగేళ్లకు ముందు ఇక్కడ జూలో జీబ్రాలు లేవు. దీంతో 2019 నవంబర్‌లో ఒక జత జీబ్రాలను పశ్చిమబంగా రాష్ట్రం కోల్‌కతాలో అలిపూర్ జూ పార్కు నుంచి జంతు మార్పిడి పద్ధతిలో జూ అధికారులు ఇక్కడకు తీసుకొచ్చారు. వాటికి బదులుగా ఇక్కడ నుంచి ఐదు అడవి కుక్కలను పంపించారు. వీటిని నెలకు పైగా క్వారెంటైన్‌లో ఉంచిన అనంతరం సందర్శకుల కోసం 2019 డిసెంబర్ 12న అప్పటి క్యూరేటర్ ఆర్.యశోదబాయి ఆ జీబ్రాలు ఎన్‌క్లోజరులో విడిచిపెట్టారు. దీంతో అంతవరకు ఇక్కడ లేని జీబ్రాలు సందర్శకులను అలరిస్తూ వచ్చాయి. వాటిలో గమ జీబ్రాకు రాజు, ఆడ జీబ్రాకు రాణి అని పేర్లు పెట్టారు. అంతవరకు బాగానే ఉంది. ఆడ జీబ్రా రాణి కొద్ది నెలలుగా అనార్యోగానికి గురైంది. ఆహారం తినకుండా ఇసుక, మట్టి తినడం వల్ల బాగా నీరసించిపోయింది. ఇక్కడ జూ వైద్య బృందం వైద్య సేవలు అందించారు. సాధారణంగా ఆరోగ్యం బాగాలేనప్పుడు ఇసుక, మట్టి తినడం జీబ్రాలు లక్షణం. జూ పార్కులలో ఉండే జీబ్రాలు ఇసుక, మట్టి తినేటప్పుడు వాటి ఆరోగ్యం బాగా లేదని అధికారులు, జూ వైద్యులు గమనించి వాటికి అవసరమైన వైద్యం అందిస్తుంటారు. ఇక్కడ అనారోగ్యంతో బాధపడుతున్న ఆడ జీబ్రా ఈ ఏడాది మార్చి 12న మృతి చెందింది. అప్పటి నుంచి మగ జీబ్రా ఒంటరైంది. గతంలో తోడుగా ఉండే రాణి, రాజు సందర్శకులను అలరించేవి. ఇప్పుడు రాజులో హుషారు తగ్గిపోయింది. సందర్శకులను అలరించలేక చెట్టు నీడన చేరుతోంది. తోడు కోసం ఎదురు చూస్తోంది. ఇదిలా ఉండగా జూలో వైద్య సేవలు సరిగా అందకపోవడం వల్లే జీబ్రా మృతి చెంది ఉంటుందని విమర్శలు వినిపిస్తున్నాయి. అనారోగ్యానికి గురైన వెంటనే వైద్యం అందించలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇది మృతి చెందిన అనంతరం పోస్టు మార్టం జరపడంతో సుమారు 16 కిలోల ఇసుక, మట్టి పొట్టలో నుంచి బయటపడినట్లు విశ్వసనీయ సమాచారం. 2013లో మలేషియా నుంచి ఇక్కడ తీసుకొచ్చిన జిరాఫీల విషయంలో కూడా ఇదే పరిస్థితి తలెత్తిందని అంటున్నారు.



జూలో ఎన్‌క్లోజ ర్‌లో ఒంటరిగా చెట్టు నీడలో మగ జీబ్రా..

ఇక్కడ ఆడ జిరాఫీకి రెండుసార్లు కూనలు పుట్టినప్పటికే ఒక్కటి కూడా నిలవలేదు. పుట్టిన కొద్ది రోజుల్లోనే మృత్యువాత పడ్డాయి. వీటికి వైద్య సేవలు సరిగా అందకపోవడమే కారణమని అప్పట్లోనే జూ అధకారులపై విమర్శలు వినిపించాయి. ఇక్కడ వన్యప్రాణుల విషయంలో అధికారులు సరైన పర్యవేక్షణ చూపాలని, పూర్తిస్థాయి వైద్య సేవలు అందించాని వన్యప్రాణి ప్రేమికులు కోరుతున్నారు.

తోడు కోసం ప్రతిపాదనలు చేస్తున్నాం

ఇటీవల జూలో రాణి అనే ఏడేళ్ల వయసు గల ఆడ జీబ్రా అనారోగ్యంతో మృతి చెందింది. ప్రస్తుతం ఒక మగ జీబ్రా ఉంది. మరణించిన జీబ్రా స్థానం భర్తీ చేయడానికి ఆడ జీబ్రాను వేరే జూ నుంచి తీసుకురావడానికి ప్రతిపాదనలు చేస్తున్నాం. ఈ విషయం ఉన్నతాధికారులు దృష్టిలో ఉంది.

– మంగమ్మ, అసిస్టెంట్ కన్జర్వేషన్ ఆఫ్ ఫారెస్ట్, ఇన్‌చార్జి క్యూరేటర్, ఇందిరాగాంధీ జూ పార్కు

ప్రసన్న వేంకటేశ్వరుడికి ప్రత్యేక పూజలు

కిటకిటలాడిన బల్లిగిరి ఆలయం



స్వామి వారి దర్శనానికి బారులు తీరిన భక్తులు



విశేష అలంకరణలో ప్రసన్న వేంకటేశ్వరస్వామి

అల్లిపురం: ప్రసన్న వేంకటేశ్వరస్వామికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. శనివారం సందర్భంగా బల్లిగిరి వెంకటేశ్వరమెట్ట దేవస్థానం భక్తులతో కిటకిటలాడింది. తెల్లవారు జాము నుంచే స్వామిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. ఆలయ అర్చకుడు గొడవర్తి రఘునాథాచార్యులు ఆధ్వర్యంలో స్వామికి సుప్రభాత సేవ, అభిషేకాల అనంతరం స్వామివారిని పుష్పమాలికలతో, తులసి మాలలతో విశేషంగా అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. తొలి పంట అయిన మామిడి పండ్లను భక్తులు స్వామికి సమర్పించారు. ఆలయ మండపంలో శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాల వద్ద భక్తుల గోత్రనామాలతో అష్టోత్తర పూజలు చేశారు. ఈ నెల 30వ తేదీన స్వామి వారి వార్షిక తిరు కల్యాణోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి రమాబాయి తెలిపారు.

రహదారి ఇలా.. రాకపోకలెలా?


అధ్వానంగా మారిన ఎన్టీపీసీ రహదారి

పరవాడ: కలపాక–దళాయిపాలెం గ్రామాల మధ్య సింహాద్రి ఎన్టీపీసీ నిర్మించిన రహదారి శిథిలమైంది. దీంతో ఇరు గ్రామాల ప్రజలు, కార్మికులు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. ఎన్టీపీసీ, హిందూజా పరిశ్రమల్లో పనిచేసే కార్మికులతో పాటు కలపాక, పిట్టవానిపాలెం, పి.బోనంగి, జాజులవానిపాలెం, దేశపాత్రునిపాలెం తదితర ప్రాంతాలకు ప్రయాణికులు నిత్యం ఈ రహదారిలో రాకపోకలు సాగిస్తారు. ఈ రోడ్డు బీటలు వారి పెచ్చులుగా ఊడిపోయి అనేక చోట్ల ధ్వంసం అయింది.దీంతో చీకటి పడిన తర్వాత వాహనాలపై వచ్చే ప్రయాణికులు రోడ్డు గుంతల్లో పడి ప్రమాదాల బారిన పడుతున్నారు. శిథిలమైన రోడ్డు మరమ్మతులు చేపట్టడానికి ఎన్టీపీసీ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

బాబోయ్ గ్రామ సింహాలు!

- వరుస దాడులతో బెంబేలెత్తుతున్న ప్రజలు
- వీధి కుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టాలని డిమాండ్


పి.బోనంగిలో కుక్కల దాడిలో గాయపడిన వృద్ధురాలు(ఫైల్)


పరవాడ రహదారిలో గుంపులుగా సంచరిస్తున్న కుక్కలు

పరవాడ: గ్రామ సింహాలు విజృంభిస్తున్నాయి. రోడ్డు మీద వెళ్లే వారిపై దాడులకు తెగబడుతున్నాయి. వీధులు, కూడళ్లలో గుంపులుగా సంచరిస్తూ ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. పాదచారులతో పాటు ద్విచక్రవాహనాలపై వెళుతున్న వారిని సైతం వెంబడించి మరీ దాడి చేస్తున్నాయి. దీంతో ప్రజలు భయపడుతున్నారు. కుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి

కుక్కల బారిన పడి గ్రామీణ ప్రజలు తరచూ ఆస్పత్రుల పాలవుతున్నారు. మండల పరిధిలో ముఖ్యంగా ముత్యాలమ్మపాలెం, నాయుడుపాలెం, తిక్కవానిపాలెం, కలపాక, పి.బోనంగి, వాడచీపురుపల్లి, రావాడ, పరవాడ, భర్నికం, తానాం, దేశపాత్రునిపాలెం గ్రామాల్లో కుక్కల బెడదతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. చీకటి పడిన తర్వాత రోడ్ల మీదకు రావడానికి భయపడుతున్నారు. పరవాడ, వాడచీపురుపల్లి, దేశపాత్రునిపాలెం, గొర్లివానిపాలెం గ్రామాల్లో మాంసం, చేపల దుకాణాల వద్ద వ్యర్థాలకు అలవాటు పడిన కుక్కలు ఆయా ప్రాంతాల్లో సంతతిని వృద్ధి చేసుకుంటున్నాయి. అక్కడే తిష్ట వేసి ప్రజలతో పాటు మూగజీవాలపై దాడులకు పాల్పడుతున్నాయి. ఇటీవల పి.బోనంగిలో పొలానికి వెళుతున్న వృద్ధురాలిపై కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపర్చాయి. పాఠశాలలకు వెళుతున్న చిన్నారులతో పాటు మహిళలపై దాడి చేస్తూ తమ ప్రతాపాన్ని ప్రదర్శిస్తున్నాయి. రాత్రి వేళలో వీధుల్లో సంచరిస్తూ అరుస్తుండడం వల్ల కంటి మీద కునుకు లేకుండా పోతుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.రహదారులపై విచ్చల విడిగా సంచరిస్తూ ద్విచక్ర వాహన దారులను వెంబడిస్తూ ప్రమాదాలకు గురిచేస్తున్నాయి.


ముత్యాలమ్మపాలెం బీచ్‌లో ..

రోజూ నాలుగైదు కేసుల నమోదు

వీధి కుక్కల బారిన పడిన కేసులు పరవాడ, వాడచీపురుపల్లి పీహెచ్‌సీల్లో రోజుకు నాలుగైదు వరకు నమోదవుతున్నాయి.పల్లెలో గుంపులుగా సంచరిస్తున్న వీధి కుక్కల నియంత్రణకు అధికారులు చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

పల్లవానిపాలెం రోడ్డు పనులకు శంకుస్థాపన


బీటీరోడ్డు పనుల శిలాఫలకం ఆవిష్కరించిన ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్

సబ్బవరం: అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి ప్రభుత్వం ముందుకు సాగుతుందని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ తెలిపారు. గాలిభీమవరం పంచాయతీ పరిధిలోని సబ్బవరం రోడ్డు నుంచి పల్లవానిపాలెం వరకూ రూ.99 లక్షలతో ఏర్పాటు చేయనున్న బీటీ రోడ్డుకు శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని తెలిపారు. సబ్బవరం రోడ్డు నుంచి జాగరపువానిపాలెం మీదుగా పల్లవానిపాలెం వరకూ రోడ్డును విస్తరించనున్నట్లు చెప్పారు.త్వరితగతిన రోడ్డును అభివృద్ధి చేసి అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. అదేవిధంగా సంక్షేమ పథకాలను వలంటీర్ల ద్వారా లబ్ధిదారుల ఇంటికే నేరుగా అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో గాలిభీమవరం సర్పంచ్ గొర్లి రాజేష్, పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కొటాన రాము, పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్‌రాజ్, పార్టీ మండల కన్వీనర్ కర్రి బాబు, సీనియర్ నాయకులు బోకం రామునాయుడు,సబ్బవరపు నారాయణమూర్తి,వనం అచ్చెంనాయుడు,కాపుశెట్టి శేషుబాబు,యడ్ల నాయుడు,బోను గంగునాయుడు తదితరులు పాల్గొన్నారు.

దేవీపురంలో ప్రత్యేక పూజలు


మహాలక్ష్మి హోమం నిర్వహిస్తున్న విదేశీయులు

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలో అక్షయ తృతీయ పర్వదినాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి శ్రీమేరుకు ఈశాన్య దిక్కులో కొలువైన శ్రీమహా లక్ష్మి అమ్మవారికి క్షీరాభిషకం,శోడషోపచార పూజలు చేశారు. బెంగళూర్, అమెరికా, జర్మనీ నుంచి వచ్చిన ప్రతినిధులు హోమశాలలో మహాగణపతి రుద్రసహిత శ్రీవిద్యారణ్య సంపుటిత మహాలక్ష్మి హోమం చేశారు.

వైభవుడికి సుప్రభాత సేవ


ఆలయ ప్రదక్షిణలో అర్చకులు, భక్తులు

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపించారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేశారు. ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన జరిగింది. సాయంత్రం 6.30 గంటలకు నక్షత్ర, కర్పూర, కూష్మాండ, కుంభ హారతులు వైభవుడికి సమర్పించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

చిత్ర పరిశ్రమకు విశాఖ అనుకూలం


మాట్లాడుతున్న ఆచార్య ప్రసాదరావు

సీతంపేట: చిత్ర పరిశ్రమ అభివృద్ధి చెందడానికి విశాఖ అనువైనదని ఏయూ మాజీ రెక్టార్ ఆచార్య ఎం.ప్రసాదరావు అన్నారు. వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మూడు రోజుల ఆస్కార్ అవార్డుల ఫిల్మ్ ఫెస్టివల్‌లో భాగంగా శనివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆస్కార్ బెస్ట్ ఫిల్మ్, 7 అవార్డులు పొందిన 'ఎవ్రీథింగ్ ఎవ్రీవేర్ ఆల్ ఎట్ వన్స్' చిత్రాన్ని ప్రదర్శించారు. దీనికి ముందుగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఫిల్మ్ ఫెస్టివల్ నిర్వహణకు కూడా అనుకూలమైన ప్రాంతమని, ఆ దిశగా ప్రభుత్వాలు ఆలోచించాలని సూచించారు. మానవ సంబంధాలు, కుటుంబ సంబంధాలు ప్రపంచంలో ఏదీ శాశ్వతం కాదనే సందేశాన్ని ఎవ్రీథింగ్ చిత్రంలో చక్కగా చూపారన్నారు. ఆదివారం సాయంత్రం 6 గంటలకు 'ది వేల్' చిత్రాన్ని ప్రదర్శిస్తామని నిర్వాహకుడు నరవ ప్రకాశరావు తెలిపారు. కార్యక్రమంలో బి.చిన్నారావు, అనూరాధ, హరనాథ్ పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతో పర్యావరణానికి మేలు


వైశాఖి స్పోర్ట్స్ పార్కులో మొక్కలు నాటుతున్న మహిళలు

మురళీనగర్: మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్కులో సిటీ టెర్రస్ గార్డెన్స్, వనితా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం ప్రపంచ ధరిత్రి దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్కులో నీడనిచ్చే మొక్కలతోపాటు బ్యూటిఫికేషన్ మొక్కలు నాటారు. మనిషికి, మట్టికి ఉన్న అవినాభావ సంబంధం, పర్యావరణానికి జరిగే మేలు గురించి వక్తలు వివరించారు. కార్యక్రమంలో వాకర్స్ డిస్ట్రిక్ట్–101 గవర్నర్ ఉప్పలపాటి శుభ, వైశాఖి స్పోర్ట్స్ పార్కు అధ్యక్షుడు సనపల వరప్రసాద్, వనితా వాకర్స్ క్లబ్ సభ్యులు, సిటీ టెర్రస్ గార్డెన్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

పుడమిని రక్షించుకోవాలి


పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ఏయూక్యాంపస్ : పుడమితల్లిని పరిరక్షించుకుంటేనే మానవ మనుగడ సాధ్యపడుతుందని వికాస తరంగిణి వ్యవస్థాపక కార్యదర్శి టి.టి.వి రమణ మూర్తి అన్నారు. ధరిత్రి దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రవిశ్వవిద్యాలయంలో విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీలను ఆయన ప్రారంభించారు. వక్తృత్వ పోటీలకు నగరంలోని వివిధ కళాశాలలకు చెందిన 300 మందికిపైగా విద్యార్థులు పాల్గొన్నారు. పిచ్చుకల సంరక్షణ, దేవాలయాలలో పాలిథిన్ వస్తువుల వినియోగం నిషేధించడం, భవిష్యత్ తరాలను కాలుష్యం నుంచి రక్షించడం, వాతావరణ విద్య, రసాయన రహిత వ్యవసాయం తదితర అంశాలపై విద్యార్థులు స్వేచ్ఛగా తమ భావాలను వ్యక్తం చేశారు.

విద్యార్థుల్లో బాధ్యతను పెంపొందించడానికి, పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతను తెలియజేయడానికి ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు సంస్థ కార్యదర్శి రమణ మూర్తి తెలిపారు. కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ పి.పద్మనాభ రావు, సెంట్రల్ కో ఆర్డినేటర్ ఏ.రాము, ఏపీ అధ్యక్షుడు ఎం.ఎస్.ఎస్‌వర్మ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమానికి ఏయూ జాతీయ సేవా పథకం సమన్వయకర్త ఆచార్య ఎస్.హరనాథ్ సమన్వయం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసా పత్రాలను ప్రదానం చేశారు. విజేతలకు బహుమతులను అందిస్తారు.

సర్వీస్ లెజెండ్ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

సీతంపేట: వరహా వెంకటేశ్వర ఎడ్యుకేషనల్ ట్రస్టు, నేషనల్ కన్జూమర్ రైట్స్ కమిషన్ సంయుక్తంగా ఈ నెల 30న జిల్లా పరిషత్ హాల్‌లో ఇంటర్నేషనల్ సర్వీస్ లెజెండ్ అవార్డుల ప్రదానం చేయనున్నట్టు ట్రస్టు వ్యవస్థాపకుడు డాక్టర్ ప్రసాద్ మార్రెళ్ల తెలిపారు. నరసింహనగర్‌లోని కన్జూమర్ రైట్స్ కార్యాలయంలో శనివారం ప్రచార పోస్టర్లను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. వివిధ రంగాల్లో సేవలందించిన వారికి ఈ అవార్డులు అందజేస్తామన్నారు. ఈ సందర్భంగా జరిగే సదస్సులో విశిష్ట సేవకులు తమ అనుభవాలు, నైపుణ్యాలను వివరిస్తారని చెప్పారు. విద్య, వైద్య, కళా, సాంస్కృతిక, సాహిత్య, క్రీడా, ప్రభుత్వ, ప్రైవేట్ ఆర్గనైజేషన్లు, ఎన్జీవో సంస్థలు, మీడియా రంగాల్లో విశిష్ట సేవలందించిన వ్యక్తుల నుంచి అవార్డుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు తెలిపారు. వ్యక్తిగత ప్రొఫైల్, సంస్థ సేవా కార్యక్రమాల వివరాలను slegendawards2023@gmail.comకు ఈ నెల 26లోగా మెయిల్ చేయాలని కోరారు. 738698 9289, 0891 3510591 నంబర్లలో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

అలరించిన సంగీత విభావరి

సీతంపేట: స్వరరాగ తరంగిణి, స్వరార్చన సంస్థలు సంయుక్తంగా శనివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించిన సినీ సంగీత విభావరి అలరించింది. గాయనీ గాయకులు అల్లిపిల్లి నరసింగరావు, భూపతిరావు, సత్యవతి, కల్యాణి, నర్సింగ్, ఎస్.రాజేశ్వరి, రాధారాణి.. ఎన్టీఆర్, ఏఎన్ఆర్ నటించిన చిత్రాల్లోని హిట్ సాంగ్స్ పాడి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో మహ్మద్ ఖాన్, చెన్నా తిరుమలరావు, సన్‌మూర్తి పాల్గొన్నారు.

అష్టలక్ష్మి ఆలయ వార్షికోత్సవం నేడు

కొమ్మాది: స్థానిక అన్నంరాజునగర్‌లో గల శ్రీ అష్ట లక్ష్మి దేవాలయం 12వ వార్షికోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్తలు అన్నంరాజు సత్యనారాయణమూర్తి, రమాదేవి దంపతులు తెలిపారు. వైశాఖ శుద్ధ తదియ అక్షయ తృతీయను పురస్కరించుకుని ఉదయం 5.30 గంటలకు సుప్రభాత సేవ అనంతరం భక్తులకు సర్వ దర్శనాలు, 8 గంటల నుంచి విశ్వక్షేణ పూజలు, 11.30కి శ్రీ లక్ష్మీనారాయణ హోమం, సాయంత్రం విశేష సేవలు, శేష వాహనం, గరుడ వాహనం, పల్లకీ సేవ, తిరువీధి ఉత్సవం, అనంతరం శ్రీ లక్ష్మీనారాయణులకు కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు చామర్తి శ్రీధరస్వామి తెలిపారు.